క్లుప్తంగా

పల్నాడు బస్ స్టాప్‌లో కార్గో సెంటర్ ప్రారంభం

పాత గుంటూరు: గుంటూరు మార్కెట్ సెంటర్లోని పల్నాడు బస్ స్టాప్‌లో ఆర్టీసీ నూతనంగా ఏర్పాటు చేసిన కార్గో సెంటర్‌ను బుధవారం గుంటూరు- 2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య పట్టణాలు హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై నగరాలకు కూడా పార్సిల్ బుకింగ్ చేయనున్నట్లు తెలిపారు. మెడికల్, వస్త్ర, ప్రింటింగ్, హోల్‌సేల్ వ్యాపారస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. బల్క్ లోడు (10 నుంచి 12 టన్నుల వరకు)కు ప్రత్యేకంగా కార్గో వెహికల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వివరాలకు 80195 40175 నంబరులో సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగులకు చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: జాతీయ విభిన్న ప్రతిభావంతుల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ) పథకం కింద జిల్లాలో ఇద్దరు దివ్యాంగులకు తలా రూ.5 లక్షల చెక్కుల్ని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి బుధవారం తన చాంబర్‌లో అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ డీడీ సీహెచ్.సువార్త పాల్గొన్నారు.

రేనాటి వీరుడు ఓబన్నకు ఘన నివాళి



ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఏసురత్నం తదితరులు

పట్నంబజారు: స్వాతంత్ర్య సంగ్రామంలో తనదైన ముద్ర వేసుకున్న పోరాట యోధుడు వడ్డే ఓబన్న అని మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం కొనియాడారు. గుజ్జనగుండ్లలోని ఆయన కార్యాలయంలో ఓబన్న జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ రేనాటి వీరుడిగా స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా మాతృదేశం కోసం పోరాడిన మహనీయుడు ఓబన్న అని కీర్తించారు. తెల్లదొరలపై తిరుగుబాటు చేసి.. స్వాతంత్ర్యం కోసం ఉద్యమించిన ఓబన్న ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, వడ్డెర సంఘం నేతలు పాల్గొన్నారు.

జీవో నంబర్-1 రద్దు చేయాలి

నెహ్రూనగర్: జీవో నంబర్-1ని రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అరండల్‌పేటలోని అంబేడ్కర్ మినీ హాలులో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సామాజిక న్యాయ కేంద్రం రాష్ట్ర కన్వీనర్ వై. కోటేశ్వరరావు (వైకే) మాట్లాడుతూ పౌర, ప్రజాస్వామ్య హక్కుల్ని హరించే విధంగా ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్- 1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై 13న కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నాయకులు తాటికొండ నరసింహారావు, రవిచంద్ర, రమణయ్య, గంట ప్రభుదాసు, సాంబశివరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువతి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏసుభక్త నగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన 20 సంవత్సరాల యువతి మంగళవారం కళాశాలకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రియల్ ఎస్టేట్ సంస్థ నిర్వాహకులపై కేసు

గుంటూరు ఈస్ట్: రియల్ ఎస్టేట్ సంస్థ మోసంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు గ్రామానికి చెందిన డి.వెంకట కృష్ణవేణి ఆర్టీసీలో కండక్టర్‌గా పని చేస్తున్నారు. 2013లో అరండల్‌పేట 2/13లోని శ్రీనాథ్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు సంస్థ నిర్వాహకులు కర్నాటి నాగేశ్వరరావు, కర్నాటి నారాయణరావు, యాదగిరి రావు, సాంబశివరావు ఆమెకు కోండ్రుపాడులో 200 గజాల స్థలాన్ని విక్రయించారు. కృష్ణవేణి తొలుత రూ. 3 లక్షలు అడ్వాన్సుగా చెల్లించారు. మిగిలిన రూ. 3 లక్షలు చెల్లించేందుకు ఆమె సిద్ధమయ్యారు. అయితే, సంస్థ నిర్వాహకులు రిజిస్ట్రేషన్‌కు రాకుండా కాలయాపన చేశారు. మరి కొంతమంది బాధితులు ఆఫీసు చుట్టూ తిరగడం చూసి తాను మోసపోయినట్లు నిర్ధారించుకుని బుధవారం కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిత్యం ప్రజలతో ప్రభుత్వం మమేకం

పట్నంబజారు: ప్రజా సమస్యల్ని తెలుసుకోవడం .. సంక్షేమాన్ని గడప ముందుకు చేర్చడం..అభివృద్ధి పథకాలు అందరికీ అందేలా లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని 53వ డివిజన్ వసంతరాయపురంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే వెళ్లారు. సమస్యల్ని తెలుసుకోవడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రజలకు వివరించారు. ప్రజలతో మమేకమై, వారి స్థితిగతుల్ని తెలుసుకునే ఒక గొప్ప కార్యక్రమే గడపగడపకు మన ప్రభుత్వమని తెలిపారు. సమస్యల్ని తెలుసుకోవడంతో పాటు వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు పాటుపడుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం కేవలం ఎన్నికల సమయంలో ప్రజలకు వద్దకు వెళ్లిందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిత్యం వారి మధ్యే ఉంటోందని పేర్కొన్నారు. అనంతరం వెంగళరావునగర్‌లో



మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

రూ. 8లక్షలతో నిర్మించనున్న సైడు డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దూపాటి వంశీ, పాపతోటి అంబేడ్కర్, యాట్ల రవి, కో-ఆప్షన్ సభ్యుడు పూనూరి నాగేశ్వరరావు, మహిళా నేత నూరిఫాతిమా, వైఎస్సార్‌సీపీ నేతలు సాల్మన్, మరియమ్మ, దాసు, జయప్రకాష్‌రెడ్డి, చెన్నుపాటి శ్రీను, లక్ష్మి, వెంకటరమణ, శ్రీను, మహేష్, వెంకట్, ప్రతాప్, నాని, నాగు నాయక్, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ నిబంధనలు పాటించాలి

డీటీసీ షేక్ కరీం

పట్నంబజారు: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యం నిబంధనలు పాటించాలని డీటీసీ షేక్ కరీం చెప్పారు. ప్రైవేటు బస్సుల డ్రైవర్లకు బుధవారం పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలతో పాటు సరుకు రవాణాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు తప్పనిసరిగా ప్రయాణికుల రికార్డుల్ని తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అనుమతి లేని సరుకు రవాణాతో పాటు డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆర్టీసీ చార్జీల్ని



డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేస్తున్న డీటీసీ, అధికారులు

ప్రామాణికంగా తీసుకుని వాటిననుసరించి ధరలు నిర్ణయించాలని చెప్పారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

పట్నంబజారు: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ నిసార్ బాషా చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో బుధవారం పాత బస్టాండ్, ఆర్కేటీ సెంటర్, లీలా మహల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఆటోస్టాండ్ల డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పైకి వచ్చే ప్రతి ఆటో డ్రైవర్ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఆటోలు ఆపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికంగా చార్జీలు వసూలు చేస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్ల సమస్యలు తెలుసుకున్న సీఐ నిసార్ బాషా

సమన్వయంతో ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా



హాజరైన వలంటీర్లు, కన్వీనర్లు, పార్టీ నేతలు, కార్పొరేటర్లు

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు (గృహ సారథులు) సమన్వయంతో ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని తూర్పు నియోజకరవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బ్రహ్మనందరెడ్డి స్టేడియం సమీపంలోని ఆయన కార్యాలయంలో బుధవారం వలంటీర్లు, కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల్ని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లు, కన్వీనర్లపై ఉందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల్ని మరింత చేరువ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని వారికి తెలియజెప్పాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ముందుకు తీసుకుని వెళ్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని వివరించారు. నియోజకవర్గ పరిశీలకుడు అడపా శేషు మాట్లాడుతూ కులమత, ప్రాంత, రాజకీయ భేదాలు లేకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయని తెలిపారు. వలంటీర్లు పారదర్శకంగా పని చేయడం ద్వారానే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో తూర్పు నియోజకవర్గ మహిళా నేత షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్లు రంగారెడ్డి, మెహమూద్, పోలవరపు జ్యోతి, మర్రి అంజలి, యాట్ల రవి, షేక్ మీరావలి, ఆబీద్ బాషా, యిర్రి ధనలక్ష్మి, పఠాన్ రిహానా, వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాలు, డివిజన్ అధ్యక్షులు, కన్వీనర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు

రూ. 9.92 లక్షల అపరాధ రుసుం వసూలు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం డీ-9 సెక్షన్ పరిధిలోని వసంతరాయపురం, నెహ్రూనగర్, ఆటోనగర్‌లలో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసబాబు చెప్పారు. మొత్తం 59 మంది అధికారులు, 118 మంది సిబ్బంది 59 బృందాలుగా ఏర్పడి 4,982 సర్వీసుల్ని తనిఖీలు చేసినట్లు వివరించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 186 మందికి రూ. 9.92 లక్షల అపరాధ రుసుం విధించామని పేర్కొన్నారు. అనుమతించిన కేటగిరి కాకుండా, ఇతర కేటగిరిల్లో విద్యుత్ వాడుకుంటున్న ఒకరికి రూ. లక్ష జరిమానా విధించామని వెల్లడించారు. అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుతున్న 185 మందికి రూ. 9.82 లక్షలు జరిమానా విధించామని చెప్పారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, చౌర్యం జరుగుతున్నట్లు తెలిస్తే 94408112263, 9440812360 నంబర్లకు నేరుగా లేదా వాట్సాప్‌కు సమాచారం అందజేయాలని కోరారు. తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయకృష్ణ, డీఈఈ ఎం.రవికుమార్, కె.రవికుమార్, ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎం.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తరగతి గదుల్లోనే ఆవిష్కరణలకు అంకురార్పణ

గుంటూరు ఎడ్యుకేషన్: తరగతి గదుల్లోనే ఆవిష్కరణలకు అంకురార్పణ జరుగుతుందని హిందూ కళాశాల పాలకమండలి ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ కళాశాలలో బుధవారం బీఎస్సీ కంప్యూటర్స్ విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏ.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మీనారాయణ మాట్లాడారు. విద్యార్థులు తమ కృషితో పాఠ్య పుస్తకాలు, తరగతి గదులు దాటి విశ్వంలో రహస్యాల్ని ఛేదించాలని సూచించారు. సాంకేతిక రంగంలో భారతదేశ శాస్త్రవేత్తలు చేసిన కృషితో దేశం వివిధ రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టిందని తెలిపారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాల్ని అందిపుచ్చుకొని అభివృద్ధిలోకి వెళ్లాలని సూచించారు. సభానంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ

శ్రీ గోదా పద్మావతి అమ్మవారికి విశేష పూజలు



విశేషాలంకరణలో స్వామి

పాత గుంటూరు: కృష్ణనగర్‌లోని శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రధానార్చకుడు ధనకుదరం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో బుధవారం శ్రీ గోదా పద్మావతి అమ్మవారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి అనంతరం కూడారై ప్రసాద విశేషాలను శ్రీనివాసాచార్యులు భక్తులకు వివరిస్తూ, స్వామికి నివేదించిన ఈ ప్రసాదాన్ని అందరూ సేవించడం విశేషమని తెలిపారు. భక్తులకు అక్షయ పాత్ర సహిత కూడారై ప్రసాదాన్ని అందించారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న మల్లాది సూరిబాబు

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో 176వ సద్గురు శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం విజయవాడకు చెందిన మల్లాది సూరిబాబు నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి సంగీతాభిమానుల్ని అలరించింది. వీరికి వయోలిన్‌పై ఆర్.దినకర్, మృదంగంపై శ్రీరాం, ఘటంపై ఏం. హరిబాబు వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారుల్ని సంస్థ సహాయ కార్యదర్శులు ఎస్. గిరిజాశంకర్, వల్లూరి కృష్ణకిశోర్ మెమెంటోలతో సత్కరించారు.

ఉత్సాహంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

గుంటూరు రూరల్: విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత మెరుగుపరచవచ్చని లయోలా పబ్లిక్ స్కూల్ సుపీరియర్ రెవరెండ్ ఫాదర్ పి.ఆంథోని తెలిపారు. మండలంలోని నల్లపాడు లయోలా పాఠశాలలో బుధవారం విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఏదో ఒక టాలెంట్ ఉంటుందని, దాన్ని వెలికి తీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదం చేస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ బి. సురేష్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో ఎడ్యుకేషనల్ విస్టా- 2023 పేరుతో వినూత్నంగా విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతకు నిలువెత్తు నిదర్శనం ఈ ప్రదర్శనలని తెలిపారు. వచ్చే ఏడాది మరింత వినూత్నంగా ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ సునీల్, రెవరెండ్ ఫాదర్ నరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీవన శైలి మార్పుతోనే అభ్యున్నతి

ర్యాగ్ పికర్స్‌కు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రేమకుమారి సూచన

నెహ్రూనగర్: కాలానుగుణంగా ర్యాగ్ పికర్స్(రోడ్ల వెంట కాగితాలు ఏరుకునే వారు) జీవన శైలిని మార్చుకుని అభివృద్ధి చెందాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ టి. ప్రేమకుమారి సూచించారు.ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో బుధవారం సీఐపీఈటీ విజయవాడ ఆధ్వర్యంలో ర్యాగ్ పికర్స్‌కు జీవనోపాధి పెంపుపై శిక్షణతో పాటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో పథకాల్ని అమలు చేస్తోందని, వాటిని వినియోగించుకుని అభివృద్ధిలోని రావాలని సూచించారు. నగరపాలక సంస్థ ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవీంద్రనాయక్ మాట్లాడుతూ 200 మందికి పైగా ర్యాగ్ పికర్స్‌కు నగరపాలక సంస్థలో కార్మికులుగా ఉద్యోగాల్ని కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మెప్మా పీడీ వెంకట నారాయణ, ఎస్ఐ కోటేశ్వరరావు, పీఐపీఈటీ ట్రెనింగ్ అధికారి కామేశ్వరరావు, అంజినాయక్, డీబీఆర్సీ నాయకులు శామ్యూల్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అప్రమత్తత అవసరం

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర ప్రజలకు కీలకమైన తాగునీటి సరఫరాలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ వరకు వేచి ఉండకుండా ఎప్పటికప్పుడు రిజర్వాయర్లు, ఫిల్టరేషన్ పాయింట్స్, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం ఏటుకూరులోని చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, రిజర్వాయర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్స్, తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో నిర్మించిన సీసీ రోడ్డు, ఫిల్టర్ బెడ్లను పరిశీలించారు. నాణ్యత, కొలతల్ని తనిఖీ చేసి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో తాగునీటి కొరత రాకుండా, ఎక్కడా కలుషిత నీటి సరఫరా జరగకుండా పటిష్ట ప్రణాళిక అవసరమని చెప్పారు. ఏటుకూరు చెరువు పరిసరాల్లోకి ఇతరులు రాకుండా గేటు ఏర్పాటు చేయాలని, రిజర్వాయర్ వద్ద ఫిల్టర్ బెడ్స్ పనుల్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని తెలిపారు. ఫిల్టర్ బెడ్స్ ఏర్పాటు వల్ల చుట్టుపక్కల ప్రాంతాలకు తాగునీటిని సమృద్ధిగా ఇవ్వడానికి వీలు కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి లక్ష్మీదుర్గ, ఎస్ఈ భాస్కర్, ఈఈలు కొండారెడ్డి, శాంతిరాజు, డీఈఈలు శివకుమార్, కల్యాణరావు, ఏఈలు రాంబాబు, రవికిరణ్, బాబర్, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

మేధో పెంపుదలకు ఇంక్యుబేషన్ సెంటర్లు దోహం

వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: మేధస్సు, సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇంక్యుబేషన్ సెంటర్లు దోహదం చేస్తాయని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. జెస్పిడ్ క్రైయో టెక్నాలజీ, ట్రీ-డీ హబ్స్ సంస్థలతో కలిసి ఏఎన్‌యూలో ఏర్పాటు చేసిన రెండు ఇంక్యుబేషన్ సెంటర్లను బుధవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇంక్యుబేషన్ సెంటర్లు ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న పరిజ్ఞానాన్ని, నూతన అంశాలను ఈ ఇంక్యుబేషన్ సెంటర్ల ద్వారా విద్యార్థులు పొందవచ్చని తెలిపారు. ఆయా రంగాలలో నిపుణుల సలహాలు సూచనలు పాటిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్ధయ్య మాట్లాడుతూ జెస్పిడ్ క్రైయో టెక్నాలజీ సంస్థతో కలిసి ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా క్రయోజనిక్, ఏవియేషన్, న్యూక్లియర్, హైడ్రోజన్, నాచురల్ గ్యాస్, మెరైన్, ఆక్సిజన్, ఫార్మాస్యూటికల్ రంగాలకు సంబంధించిన అంశాలపై విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ అందిస్తామన్నారు. ట్రీ-డీ హబ్స్ సంస్థతో కలిసి ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇస్తారన్నారు. జెస్పిడ్ క్రైయో టెక్నాలజీ సంస్థ ద్వారా అందించే సేవలతో కూడిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను ఆ సంస్థ ఎండీ నూతక్కి వినోద్ కుమార్, ట్రీ-డీ హబ్స్ సంస్థ ద్వారా అందించే పరిజ్ఞానానికి సంబంధించిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను ఆ సంస్థ ఎండీ కె.సాయి కృష్ణఅనురూప్ సమర్పించారు. రెండు సంస్థలు వేర్వేరుగా ఏఎన్‌యూతో అవగాహనా ఒప్పందం(ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. ఎంఓయూ పత్రాలపై యూనివర్సిటీ అధికారులు, ఆ సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ తౌసీఫ్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జెస్పిడ్ సంస్థ ప్రతినిధుల నుంచి ఎంఓయూ పత్రాలు అందుకుంటున్న వీసీ

సంక్రాంతి సంబరాల బ్రోచర్ ఆవిష్కరణ



సంక్రాంతి సంబరాలు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, కమిషనర్ కీర్తి చేకూరి తదితరులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగర ప్రజలు సంక్రాంతి సంబరాల్ని ఆస్వాదించాలని కోరారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ మరచిపోతున్న గ్రామీణ సంప్రదాయాల్ని సంస్కృతిని నేటి తరానికి చూపించడానికి ఈ సంబరాలు దోహదపడుతాయని తెలిపారు. మేయర్ కావటి మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలు, కళా రూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రతి రోజు పండుగ వాతావరణం ఉంటుందని తెలిపారు. కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ 11,12 తేదీల్లో క్రీడలు, 13,14,15 తేదీల్లో సంక్రాంతిని ప్రతిబింబించేలా కార్యక్రమాల్ని రూపొందించినట్లు చెప్పారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా బుధవారం ఉదయం గుంటూరు నగరంలోని ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థల విద్యార్థులకు వివిధ క్రీడాంశాలలో ప్రారంభమైన పోటీల్ని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చంద్రగిరి యేసురత్నం, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఈఈ సుందరరామి రెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ పోల్‌పై ఏడు అడుగుల పాము

పలు గ్రామాలకు నిలిచిన సరఫరా

ప్రత్తిపాడు: సహజంగా లైన్స్ ట్రిప్ అయ్యో.. వైర్లు తెగో.. పోల్స్ విరిగిపడితేనో.. లేక ప్రకృతి విపత్తుల సమయాల్లోనో పోల్స్ దెబ్బతిన్న సందర్భాల్లోనూ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. కానీ ఇక్కడ మాత్రం అలా కాదు. ఒక పాము విద్యుత్ పోల్ పై పడటంతో దాదాపుగా పది గ్రామాలకు కొంత సమయం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిపాలెం సబ్ స్టేషన్ నుంచి ఈదులపాలెం సబ్ స్టేషన్‌కు అక్కడి నుంచి ప్రత్తిపాడు సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా జరుగుతుంది. ప్రత్తిపాడు సబ్ స్టేషను నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా వెళుతుంది. అయితే, ఈదులపాలెం సమీపంలోని ఒక విద్యుత్ పోల్‌పై బుధవారం ఉదయం పాము పడటంతో రెండు వైర్లు కలిసి పవర్ ట్రిప్ అయ్యింది. దీంతో హైవేను ఆనుకుని ఉన్న ఈదులపాలెం, యనమదల, నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో సరఫరా నిలిచిపోయింది. దీంతో సిబ్బంది సమస్యను తెలుసుకునేందుకు మూడు నాలుగు గంటల పాటు నానా అగచాట్లు పడ్డారు. ఆయా గ్రామాల్లోని సుమారు150 విద్యుత్ స్తంభాల్ని గాలించారు. తీరా ఈదులపాలెం సమీపంలో ఒక స్తంభంపై పాము పడి ఉండటం గమనించి దాన్ని తీశారు. ఏదైనా పక్షి అక్కడ పామును వదిలేసి వెల్లడమో, లేక పై నుంచి వెళ్లే సమయంలో పక్షి నోటి నుంచి జారి కింద పడటమో జరిగి ఉంటుందని విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు.



విద్యుత్ పోల్‌పై వేలాడుతున్న పాము, ఇన్‌సెట్‌లో విద్యుత్ షాక్ తో చనిపోయిన సర్పం